క్లుప్తంగా

వీఎంసీలో నేడు 'స్పందన'

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూం, నగరంలోని మూడు సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగర వాసులు ఫిర్యాదులు, అర్జీలను అధికారులకు అందజేయాలన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



పటమట(విజయవాడతూర్పు): మొక్కల పెంపకంతో పర్యావరణం పరిరక్షించబడుతుందని వీఎంసీ సీఎంఓహెచ్ డాక్టర్ పి.రత్నావళి తెలిపారు. ఇండియన్ స్వచ్ఛత 2.0లో భాగంగా స్వచ్ఛతాహి సేవాలో భాగంగా ఆదివారం పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. 62వ డివిజన్‌లోని రాధానగర్‌లో కార్పొరేటర్ విజయలక్ష్మి, 35వ డివిజన్‌లో కార్పొరేటర్ బాలసాని మానిమ్మ, 45వ డివిజన్‌లో కార్పొరేటర్ మాధురి లావణ్య, 12వ డివిజన్ అశోక్ నగర్‌లో ఉన్న స్థానిక అపార్టుమెంట్ వాసులు, 39వ డివిజన్ షాదీఖానా రోడ్డులో సీఎంఓహెచ్ డాక్టర్ పి.రత్నావళి వారి బృందంతో మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న సీఎంఓహెచ్ డాక్టర్ పి.రత్నావళి మాట్లాడుతూ.. పెరుగుతున్న కాలుష్యం నుంచి రక్షించుకోవటానికి మొక్కలు నాటాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో రహదారులను శుభ్రం చేశారు.

అలరిస్తున్న గ్రేట్ బాంబే సర్కస్



లబ్బీపేట(విజయవాడతూర్పు): బృందావనకాలనీలోని వజ్ర గ్రౌండ్స్‌లో బాంబే సర్కస్ రోజుకు మూడు షోలు నిర్వహిస్తూ ప్రజలను అలరిస్తోందని నిర్వాహక సంస్థ మేనేజింగ్ పార్టనర్ కేఎం సంజీవ్, మేనేజర్ పీపీ ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట, సాయంత్రం 4, 7 గంటలకు షోలు ప్రదర్శిస్తున్నామన్నారు. ఈ సర్కస్‌లో ఇండియా, చైనా, నేపాల్, ఇథోపియా దేశాలకు చెందిన 125 మంది కళాకారులు ప్రదర్శనల్లో పాల్గొంటున్నట్లు వారు తెలిపారు.

గణనాథునికి నృత్య నీరాజనం



విజయవాడకల్చరల్: అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్రుల సందర్భంగా సీతారామా కల్యాణ మండపంలో ఆదివారం నాట్యాచారిణి యల్లాజోస్యుల అనూరాధ బృందంలోని చిన్నారులు ప్రదర్శించిన అంశాలు ఆకట్టుకున్నాయి. శ్రీ గణనాథం, మోదక హస్తతో పాటు అన్నమయ్య, రామదాసు కీర్తనలకు నృత్యాలను అభినయించారు. ఉదయం సేవా సంఘ సభ్యులు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం కార్యదర్శి దశరథ రమేష్, కార్యదర్శి అనుముల సోమశేఖర్, కమిటీ సభ్యులు డాక్టర్ గురునాధ్ శర్మ, గణపతి మూర్తి, మహిళా కార్యదర్శులు దుర్గాసావిత్రి, శిరీష పాల్గొన్నారు.

దీర్ఘకాలిక నొప్పులపై అవగాహన అవసరం

పెనమలూరు: దీర్ఘకాలిక నొప్పులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఫిజియో థెరపిస్ట్, పెయిన్ మెడిసిన్ నిపుణుడు చావా మురళీకృష్ణ అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ఎన్ఎస్ఎస్ విభాగం, వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దీర్ఘకాల నొప్పులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సరైన పద్ధతిలో కూర్చోకపోవటం, నిద్రించే సమయంలో సరైన పరుపులు వాడకపోవటం, ఎక్కువ సమయం కంప్యూటర్ వద్దే కూర్చోవటం వంటి కారణాల వలన నొప్పులు వస్తాయన్నారు. డాక్టర్ నందిగం రాఘవ మాట్లాడుతూ సరైనా పాదరక్షలు వాడితే నొప్పులు రాకుండా నివారించవచ్చన్నారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు రూప్‌కుమార్, కార్యదర్శి సతీష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, సభ్యులు పాల్గొన్నారు.

గంగమ్మ ఒడికి గణనాథులు

వైభవంగా గణపతి నిమజ్జనోత్సవాలు



సమ్మెట వారి వీధిలో ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే వెలంపల్లి, నిర్వాహకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నియోజకవర్గ వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఏడో రోజైన ఆదివారం గణనాథులకు విశేష పూజలు నిర్వహించారు. పలు మండపాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి, గణనాథులను మేళతాళాలు, కళాకారుల నృత్యాల మధ్య నిమజ్జనానికి తరలించారు. వన్‌టౌన్‌లోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పందిళ్ల నిర్వాహకులు గణనాథుల ఊరేగింపులను భారీగా నిర్వహించారు. మేళతాళాలు, చిత్ర విచిత్ర వేషధారణలు, జానపద నృత్యాలతో ముందుకుసాగిన గణపతి నిమజ్జన ఊరేగింపులు వన్‌టౌన్ వాసులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

బై..బై.. గణేశా..

వన్‌టౌన్‌లోని కొత్తపేట, బ్రాహ్మణవీధి, కొండ ప్రాంతాలు, ఇస్లాంపేట, తారాపేట తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పందిళ్ల నిర్వాహకులు గణపతి ఉత్సవాలకు ఆదివారం ముగింపు పలికారు. అనంతరం గణపతి విగ్రహాలను అత్యంత సుందరంగా అలంకరించిన వాహనంపై ఉంచి కృష్ణానదికి తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. అదేవిధంగా సమ్మెట వావరి వీధిలోని బాల విఘ్నేశ్వర సేవా సమితి నిర్వాహకులు భారీ ఊరేగింపుతో స్వామి వారిని నిమజ్జనానికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొని విశేష పూజలు చేశారు. కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ ఆధ్వర్యంలో భారీ ఊరేగింపును నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీరోడ్డు, బ్రాహ్మణవీధి, మొయిన్‌బజార్, నెహ్రూ బొమ్మ సెంటర్, రథం సెంటర్, కెనాల్‌రోడ్డు తదితర ప్రాంతాలన్నీ మధ్యాహ్నం నుంచి పూర్తిగా గణపతి నిమజ్జన ఊరేగింపులతో నిండిపోయాయి. స్థానిక పోలీసులు ఆయా ఊరేగింపులను ముందుకు కొనసాగిస్తూ నది వద్ద ఉన్న సిబ్బందితో సమన్వయం చేశారు. ఆయా ఊరేగింపుల సందర్భంగా యువత కోలాట విన్యాసాలతో సందడి చేశారు. వారితో పాటుగా జానపద కళాకారులు సైతం తమ నృత్యాలు, విన్యాసాలతో కనువిందు చేశారు.

శివాలయం రోడ్డులో కోలాహలంగా ఊరేగింపు

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం టీచర్స్‌కాలనీలోని శివాలయం వీధిలో గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా ముగింపుగా ఆదివారం రాత్రి చేపట్టిన గణేష్ నిమజ్జన కార్యక్రమం కోలాహలంగా జరిగింది. ఉదయం గణనాథునికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని వేలం వేశారు. అనంతరం గణపతి విగ్రహాన్ని ట్రాక్టర్‌పై పెట్టి వీధుల్లో ఊరేగించారు. భక్తులు వాహనం ముందు నీటిని వారబోసి కొబ్బరికాయలను కొట్టి హారతులిచ్చారు. ఊరేగింపు అనంతరం గణనాథుని విగ్రహాన్ని కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. ఉత్సవాలు స్థానిక పెద్దలు ఓరుగంటి శేఖర్ రెడ్డి, రాధాకృష్ణ, మహేష్ రెడ్డి, రవిచంద్రా రెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని గణపతి బొప్పా మోరియా అంటూ ఉత్సాహంగా కేరింతలు కొట్టారు.



కుమ్మర వీధిలో నిమజ్జనానికి తరలివెళ్తున్న వినాయకుడు



కొత్తపేటలో..



గణనాథుడి ఊరేగింపులో గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు

మహిళా బిల్లులో ఓబీసీలకు తీరని అన్యాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన మహిళా బిల్లులో దేశంలో 50 శాతానికి పైగా ఉన్న ఓబీసీ మహిళలకు తీరని అన్యాయం జరిగిందని సామాజిక న్యాయ కేంద్ర కన్వీనర్, న్యాయవాది వై.కోటేశ్వరరావు(వైకే) అన్నారు. బందరు లాకుల సమీపంలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో మహిళా బిల్లుపై బీసీ సంఘాలు, బీసీ కులాల ప్రతినిధుల రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం జరిగింది. ఓబీసీ మహిళలకు రిజర్వేషన్ సాధనకు ఉద్యమించాలని సమావేశం తీర్మానించింది. సమావేశంలో వైకే మాట్లాడుతూ.. దేశంలో 50 శాతానికి పైగా ఉన్న ఓబీసీ మహిళలు, మైనార్టీ మహిళలకు రిజర్వేషన్లు లేకుండా మహిళా బిల్లును రూపొందించడం దుర్మార్గమన్నారు. ఆధిపత్య కులాలకు పార్లమెంట్, శాసన సభల్లో హెచ్చు భాగం స్థానాలు కల్పించడం రాజ్యాంగంలోని సామాజిక న్యాయ సూత్రాలకు విరుద్ధమన్నారు. ఈ బిల్లు ద్వారా మహిళా సాధికారత సాధిస్తామనడం బూటకమని పేర్కొన్నారు. ఓబీసీ మహిళలకు కూడా చట్ట సభల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఓబీసీలకు రిజర్వేషన్లు, జాతీయ స్థాయిలో కుల గణన చేసేంత వరకు ఉద్యమిస్తామన్నారు. ఈ నెల 26న విజయవాడ ధర్నా చౌక్‌లో ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో బీసీ సంఘాలు, బీసీ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటింటా ఆరోగ్య సర్వే

గన్నవరం రూరల్: మండలంలోని గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఆదివారం ఆరోగ్య సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ ఆరోగ్య సిబ్బంది వెళ్లి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితులను నమోదు చేస్తున్నారని మండల వైద్యాధికారి ఆనంద్‌బాబు చెప్పారు. అంతేగాక వారి డేటాను నమోదు చేయటం, అనంతరం ఏర్పాటు చేసే వైద్య ఆరోగ్య క్యాంపులలో డాక్టర్లచే వైద్య సేవలు అందిస్తామని పేర్కొన్నారు. మాదలవారిగూడెం గ్రామంలో ఏఎన్ఎం మేరీగ్రేస్ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు.

వైభవంగా చవితి వేడుకలు

- శ్రీ కామధేను సహిత కల్పవృక్ష గణపతిగా బాలగణపతి
- శాస్త్రోక్తంగా లక్ష బిల్వార్చన, రుద్రాభిషేకం
- అలరించిన సంగీత విభావరి



శ్రీ కామధేను సహిత కల్పవృక్ష గణపతిగా స్వామి వారు



పూజల్లో పాల్గొన్న భక్తులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ బాలగణపతి స్వామి వారు శ్రీ కామధేను సహిత కల్పవృక్ష గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. వన్‌టౌన్ పూజారివారి వీధిలో వేంచేసి ఉన్న శ్రీ బాలగణపతి దేవస్థానంలో స్వామి వారి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం స్వామి వారు శ్రీ కామధేను సహిత కల్పవృక్ష గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం సుప్రభాత సేవతో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం 108 మంది మహిళలు కృష్ణానది నుంచి పవిత్ర జలాలను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామి వారికి అభిషేకించారు. అనంతరం స్వామి వారికి రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం స్వామి వారికి సహస్ర మోదక పూజను జరిపారు. అదేవిధంగా స్వామి వారి సన్నిధిలో లక్ష బిల్వార్చనను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామి వారికి విశేష పూజలు చేశారు. కార్యక్రమాలను కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గ్రంధి శ్రీనివాసరావు, మామిడి వెంకటకృష్ణారావు పర్యవేక్షించారు.

కనులపండువగా వాహన సేవ

స్వామి వారి సన్నిధిలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారి వాహన సేవ కనులపండువగా జరిగింది. ప్రత్యేకంగా మూషిక వాహన సేవను చేపట్టారు. ఈ సందర్భంగా స్వామి వారి వాహనసేవలో ప్రత్యేక పూజలు, సాయంత్రం సినీ సంగీత విభావరి నిర్వహించారు. అందులో భాగంగా కళాకారులు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం భక్తి పాటల పోటీలను నిర్వహించారు. పోటీలను కమిటీ సభ్యురాలు ఆతుకూరి శ్రీదేవి పర్యవేక్షించారు.

జటాయు క్యారవాన్ ప్రారంభం



క్యారవాన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, నిర్వాహకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అన్ని వసతులతో కుటుంబ సౌకర్యాలు ఉండే విధంగా శ్రీ వెంకటేశ్వర మోటో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ క్యారవాన్‌ను ప్రారంభించడం అభినందనీయమని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. సినీ, సీరియల్, షార్ట్ ఫిలిం నిర్మాణాలకు సంబంధించి వినియోగించే జటాయు క్యారవాన్‌ను వన్‌టౌన్ గాంధీజీ హైస్కూల్ ప్రాంగణంలో ఎమ్మెల్యే వెలంపల్లి ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పుడు మన విజయవాడ నగరంలో కుటుంబం మొత్తం కలిసి వెళ్లే చక్కటి జటాయు క్యారవాన్‌ను ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఆరుగురు యువకులు ఒక టీమ్‌గా కలిసి మంచి ఆలోచనతో ఎవరి మీద ఆధారపడకుండా తమ కాళ్ల మీద తాము నిలబడాలని ఈ అద్భుత ఆలోచన చేశారన్నారు. ఒక ఇంటిలో ఎన్ని మౌలిక సదుపాయాలు, ఎన్ని వసతులు ఉంటాయో అవన్నీ క్యారవాన్‌లో చూడొచ్చని చెప్పారు. ప్రతి మనిషికి అవసరమయ్యే అవన్నీ ఈ క్యారవాన్‌లో ఉన్నాయని సెలబ్రిటీలు ఎలా బయటకు వెళ్తారో ఇప్పుడు ప్రతి కుటుంబం కూడా ఈ క్యారవాన్‌ను ఉపయోగించుకోవచ్చని తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్యారవాన్ నిర్వాహకులు వంశీ, వక్కలగడ్డ నాగప్రసాద్ మాట్లాడుతూ.. ఏపీలో మొట్టమొదటిగా క్యారవాన్‌ను విజయవాడలో ప్రారంభించడం సంతోషంగా ఉందని చెప్పారు.

కార్యక్రమంలో కార్పొరేటర్లు చటర్జీ, మైలవరపు మాధురి లావణ్య, నిర్వాహకులు పరిమి సునీల్ కుమార్, కొరిపాకుల వినయ్ కుమార్, నటరాజ్ శేఖర్ సురేంద్రరావు, శ్రీనివాసరావు, సుబ్బారావు, మురళి, భాస్కర్ పాల్గొన్నారు.

గుండె సమస్యలపై అవగాహన అవసరం



డాక్టర్ వరుణ్‌ను సన్మానిస్తున్న సమభావన మిత్రమండలి సభ్యులు

పటమట(విజయవాడతూర్పు): గుండె సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ వరుణ్ అన్నారు. సమభావన మిత్రమండలి ఆధ్వర్యంలో పటమట వాసవ్య మహిళా మండలిలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండె సమస్యలను గుర్తించడానికి అవసరమైన అన్ని వసతులు నగరంలోనే అందుబాటులో ఉన్నాయన్నారు. గుండెపై పరిశోధనలు కూడా అత్యధికమయ్యాయని, ఈ నేపథ్యంలోనే అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు. అనంతరం సమభావన మిత్రమండలి ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో మిత్రమండలి విజయవాడ శాఖ అధ్యక్షుడు కోనేరు నరేంద్రబాబు, సభ్యులు టి.శోభనాద్రి, వై.రంగారావు, సీహెచ్ వెంకటరెడ్డి, భాస్కరరావు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, ఎంవీ రావు, గోళ్ల నారాయణరావు, ప్రొఫెసర్ ప్రసాద్, తాతినేని శివాజీ, కొండపల్లి మాధవరావు పాల్గొన్నారు.

ఐదు దశాబ్దాల తర్వాత ఆత్మీయ సమ్మేళనం



గన్నవరం రూరల్: వారంతా ఐదు దశాబ్దాల కిందట ఒకే చోట కలసి చదువుకున్న విద్యార్థులు. అప్పట్లో మెట్రిక్యులేషన్ పూర్తి చేసిన వారు. 1970లో కలసి చదువుకుని, విద్యను పూర్తి చేసి వివిధ రంగాల్లో రాణిస్తున్న వారందరూ ఆదివారం గన్నవరం మండలం చిన అవుటపల్లి పుణ్యాచారిటీస్ వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో కలిశారు. విద్య నేర్పిన గురువులను స్మరించుకున్నారు. ఆనాడు తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువుల మార్గదర్శనంలోనే జీవితాలు కొనసాగించామని, ఆనాటి మధుర అనుభూతులను నెమరువేసుకున్నారు. క్రమశిక్షణ, రుజువర్తన, సత్యశీలత, సమాజం పట్ల బాధ్యతలు నేర్పిన గురువులు వేమూరి గోపాలరావు, పిచ్చాచార్యులుకు నివాళులర్పించారు. దుర్గా ట్యుటోరియల్ కాలేజ్, వెంకటేశ్వర ట్యుటోరియల్ కాలేజ్ విద్యార్థులైన తమకు సైన్స్ బోధన చేసిన అధ్యాపకుడు ముక్కామల ఉమామహేశ్వరరావును సత్కరించి అభిమానం చాటుకున్నారు. పుణ్యాచారిటీస్ కార్యదర్శి జాస్తి విజయభూషణ్‌కుమార్, గూడవల్లి బాబూరావు, బాబి, కేకే చౌదరి, లావు చలపతిరావు, సాంబశివరావు, శర్మ, గన్నవరం ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మన్నే సుందరరావు పాల్గొన్నారు.

● వేడుకగా వీఐటీ - ఏపీ స్నాతకోత్సవం



అమరావతిలో వీఐటీ - ఏపీ విశ్వవిద్యాలయం మూడో స్నాతకోత్సవం క్యాంపస్‌లో వేడుకగా జరిగింది. ఏపీ జ్యుడీషియల్ ప్రివ్యూ కమిటీ చైర్మన్ జస్టిస్ బి.శివశంకర్‌రావు, వీఐటీ ఫౌండర్, చాన్సలర్ జి.విశ్వనాథన్ తదితరులు పాల్గొని విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేశారు.

అలరించిన ఆ పాత మధురాలు



భక్తి గీతాలను ఆలపిస్తున్న గాయనీ గాయకులు

విజయవాడకల్చరల్: స్వరఝరి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రుల ముగింపు సందర్భంగా గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికమీద ఆదివారం నిర్వహించిన ఆపాత మధురాలు, భక్తి గీతాల కార్యక్రమం అలరించింది. ఒంగోలుకు చెందిన తాళ్లూరి శ్రీదేవి ఆధ్వర్యంలో అంజిబాబు, డి.కోటేశ్వరరావు అశోక్ ,బాలాజీ, పూర్ణచంద్రరావు, రంగనాథం అంజుస్వామి, పద్మశ్రీలు ఘంటసాల, బాల సుబ్రహ్మణ్యం, జేసుదాసు ఆలపించిన గీతాలను ఆలపించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ.. నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పించాల్సిన అవసరముందన్నారు. ఘంటసాల వెంకటేశ్వరరావు పేరుతో జిల్లాలో ఆడిటోరియం నిర్మించడానికి కృషి చేస్తున్నామన్నారు. స్వరఝరి సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాలో ఘంటసాల, బాల సుబ్రహ్మణ్యం పేరుతో సినీ సంగీత విభావరి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు

అధికారంతోనే అన్ని సమస్యలకు పరిష్కారం

కృష్ణలంక(విజయవాడతూర్పు): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన కుల నిర్మూలన పద్ధతులను ఆచరిస్తూ దళిత బహుజనులు రాజకీయ శక్తిగా అవతరించాలని, అధికారంతోనే అన్ని సమస్యలకు పరిష్కార మార్గాలు లభిస్తాయని సీ ఫర్ కాస్ట్ గ్రంథ రచయిత సతీష్ చందర్ అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో బ్లూ వింగ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చెంచాలే నేతలయితే అనే అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సతీష్ చందర్ మాట్లాడుతూ.. దళిత, బహుజనులు ఐక్యతగా ఏర్పడి తెలుగు రాష్ట్రాల్లో అధికారం కోసం, రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని సూచించారు. ఈ సదస్సులో బ్లూ వింగ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పులి మల్లికార్జునరావు, చీఫ్ అడ్వైజర్ డాక్టర్ శివరామ కృష్ణారావు, ఏపీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ట్రెజరర్ రాజేష్‌బాబు, ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నప్రదీప్, పులిదిండి వేణుగోపాల్, ఉన్నవ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కో ఆపరేటివ్ బ్యాంక్‌లో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

లబ్బీపేట(విజయవాడతూర్పు): విశాఖ కో ఆపరేటివ్ బ్యాంక్ పటమట బ్రాంచిలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో శ్రీకాంత్ డయాబెటీస్ సెంటర్‌కు చెందిన వైద్యులు పాల్గొని బ్యాంక్ సభ్యులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా మధుమేహాన్ని నివారించడంతో పాటు వ్యాధిపై డాక్టర్లు ఎం.శ్రీకాంత్, ఎం.సునీతలు అవగాహన కల్పించారు. మధుమేహం రాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి, వచ్చిన తర్వాత ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి అనే అంశాలను వివరించారు. 100 మందికి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం విశాఖ కో ఆపరేటివ్ బ్యాంక్ మార్గదర్శకులు, మాజీ ఎమ్మెల్యే ఆంజనేయులు వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లను సత్కరించారు. బ్యాంక్ డైరెక్టర్ సీహెచ్ కోటేశ్వరరావు, జోనల్ మేనేజర్ ఈజీ సుబ్రహ్మణ్యం, బ్రాంచి మేనేజర్ ఓ.కొండబాబు, సభ్యులు నార్ల మాలతి, నరసింహారావు, పి.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువతి అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కంసాలిపేట తమ్మిన పోతరాజు స్కూల్ ప్రాంతానికి చెందిన వీర్ల శివమ్మ, మల్లేశ్వరరావులకు నలుగురు సంతానం. మూడో అమ్మాయి నాగదుర్గ నగరంలోని ఓ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసింది. శనివారం కాలేజీకి వెళ్లి సర్టిఫికెట్స్ తెచ్చుకుంటానని చెప్పి వెళ్లింది. సాయంత్రం అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో ఆందోళన చెందిన తల్లి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఆటపాటలతో ప్రజల్లో చైతన్యం

గన్నవరం: ప్రజానాట్య మండలి కళాకారులు ఆటపాటలు ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ఆట్లూరి శ్రీమన్నారాయణ మీటింగ్ హాల్లో ఏర్పాటు చేసిన ప్రజానాట్య మండలి రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు, ప్రభుత్వ విధానాలను జనంలోకి తీసుకువెళ్లేందుకు కళాజాతలు దోహదపడతాయని చెప్పారు. వచ్చే నెల 4 నుంచి 8వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు.